పిచ్చుక వరలక్ష్మి దబ్బున సోఫాలో కూలబడింది. ఆ దెబ్బకి సోఫా స్ప్రింగులు కీచు కీచు మని శబ్దం చేసాయ్.

"మీరు *టిఫిన్లు* కానియ్యండి బావగారు!" అన్నాడు పిచ్చుక సుబ్బారావు.

అందరూ స్వీటూ హాటులమీద పడ్డారు. బుచ్చిబాబు వంచిన తల ఎత్తకుండా సీరియస్‌గా తినడం మొదలుపెట్టాడు. అతని వ్యవహారం చూసిన పర్వతాలరావుకి మండింది.

"నిన్ను ఒట్టి తిండిపోతు వెధవనుకుంటారు. లపక్-లపక్‌మని మింగటం మాని కాస్తా ఆ పిల్లదాని వంక కూడా చూడు..." బుచ్చిబాబు చెవిలో గుసగుసలాడ్తు విసుక్కున్నాడు పర్వతాలరావు.

"ఇంకా చూడ్డానికి అక్కడ ఏం మిగిలుంది గనుక!.... ఇందాక గుమ్మంలోనే చూడొద్దని అనుకున్నా కొట్టొచ్చినట్టు మొత్తం కనిపిస్తేను!..." బుచ్చిబాబు కూడా పర్వతాలరావు చెవిలో గుసగుసా అన్నాడు.

"సరేసరే...మరీ అంత సీరియస్‌గా ఆముదం త్రాగిన మొహం పెట్టకు...కాస్త నవ్వు!"

బుచ్చిబాబు నవ్వాడు.

"మరీ అంతగా నవ్వకు...జులాయ్ వెధవ అనుకుంటారు...."

బుచ్చిబాబు విసుక్కుంటూ మళ్ళీ స్వీట్స్‌మీద పడ్డాడు.

టిఫిన్స్ కార్యక్రమం పూర్తయ్యింది. కాఫీలు కూడా పిచ్చిక రమేష్ పిచ్చిక సురేష్‌లు సర్వ్ చేశారు. అంతా అయ్యాక పార్వతమ్మ గొంతు సవరించుకుని పిచ్చిక వరలక్ష్మిని అడిగింది.

"చూడమ్మా ..నువ్వు ఏందాకా చదువుకున్నావ్?"

"బి.కాం ఫైనల్ దాకా చదివి ఆపేశానండీ!" సిగ్గు పడుతూ సమాధానం చెప్పింది పిచ్చుక వరలక్ష్మి.

"అదేం? డిగ్రీ ఎందుకు పూర్తిచేయ్యలేదూ?"

"చదవాలంటే బోర్ ఆంటీ...." దీర్ఘాలు తీసింది పిచ్చుక వరలక్ష్మి. వాళ్ళు ముగ్గురూ మొహమొహాలు చూస్కున్నారు.

"మరి ఇంట్లో వుంటే బోర్ కదమ్మా?" రెండు క్షణలాగి ప్రశ్నించాడు పర్వతాలరావు.

"బోర్ ఎందుకంకుల్?... ఇంట్లో టివిలో అన్ని ఛానెల్స్‌లోను సినిమాలు చూస్తుంటానంకుల్.. అదీ బోర్ కొడ్తే ఏదో ఒకటి తింటూ కూర్చుంటానంకుల్..." గారాలు పోతూ అంది పిచ్చిక వరలక్ష్మి. వాళ్ళు ముగ్గురూ మొహమొహాలు చూస్కున్నారు.

"మీరు మా అమ్మయ్ అన్న ప్రతి మాటకీ మొహమొహాలు చూస్కుంటే నాకు టెన్షన్ పెరుగుతోంది బావగారూ" అన్నాడు పిచ్చుక సుబ్బారావ్.

"నీకు పాటలు పాడ్డం వచ్చా అమ్మాయ్..." అడిగింది పార్వతమ్మ.

"మా అమ్మాయ్ చాలా బాగా పాడ్తుంది వదినా...ఏదీ.. ఓ పాట వినిపించవే......" పిచ్చుక మహలక్ష్మి అంది. పిచ్చుక వరలక్ష్మి గొంతు సవరించుకుని ఓ సినిమా పాట అందుకుని

అపస్వరాలతో పాడడం మొదలుపెట్టింది.

"బావలు సయ్యా...హోయ్! మరదలూ సయ్య...... హోయ్! రింబోలా రింబోలా రింబో.....లా"

"చాలు చాలు...." కంగారుగా అంటూ లేచి నిల్చున్నాడు పర్వతాలరావు, అతనితో బాటు పార్వతమ్మ, బుచ్చిబాబు కూడా లేచి నిల్చున్నారు.

"అదేంటి బావగారూ లేచిపోయారేం... కూర్చోండి! లేటెస్ట్‌గా రిలీజైన పాటల్ని కూడా మా అమ్మాయ్ పాడి వినిపిస్తుంది".

"వీల్లేదు...మేం వెళ్ళిపోవాలి! మేం ఏడు గంటల్లోగా ఇక్కడి నుండి వెళ్ళిపోవాలనీ లేకపోతే రాహువు మెడని కేతువు పిసుకుతాడని సిద్ధాంతి వెధవ చెప్పాడు...మేం రెండు రోజుల తర్వాత ఏ విషయం చెప్తాం!" అంటూ హడావుడిగా బయటికి వచ్చేశాడు పర్వతాలరావు. బుచ్చిబాబు, పార్వతమ్మ ఆయన్ని కంగారుగా అనుసరించారు.

0 0 0

సాయంత్రం ఆరు గంటలు!....

పార్కులో...

బుచ్చిబాబు మాట్లాడ్తుండగానే సీత సిమెంటు బెంచి మీద నుండి దిగ్గున లేచింది.

"...ఏంటి సీత లేచిపోయావ్?" అడిగాడు బుచ్చిబాబు.

"లేకపోతే నువ్వు చెప్పే చచ్చు కబుర్లు వింటూ కూర్చోమంటావ్? పెళ్ళి చూపులకి వెళ్తాడంట పెళ్ళి చూపులకి!!...వెళ్ళి ఆ రోడ్డురోలర్‌నే చేస్కో...." విసురుగా ముందుకు అడుగులు వేసింది సీత. బుచ్చిబాబు సిమెంటు బెంచి మీద నుంచి ఒక్క గెంతు గెంతి సీత దారికి అడ్డుగా నిల్చున్నాడు.

"ఎందుకంత కోపం సిల్లీగా?... ఆ అమ్మాయ్ మానాన్నకేం నచ్చలేదుగా?!" అన్నాడు బుచ్చిబాబు .

"అయితే నీకు నచ్చిందా!" కోపంగా చూస్తూ అడిగింది సీత.

"నువ్వుండగా నాకు వేరే అమ్మాయ్ నచ్చే ప్రసక్తే లేదు!.... మా నాన్నకి నచ్చితేనే ప్రాబ్లెం అయి వుండేది!!"

"అంటే ఒకవేళ ఆ అమ్మాయే మీ నాన్నకి నచ్చి వుంటే చేసుకోడానికి సిద్ధపడిపోయి వుండేవాడివన్న మాట!!"

"అబ్బా...! సిల్లీగా వేరే అర్థాలు తియ్యకు. ఇప్పుడు నచ్చలేదని చెప్తున్నానుగా?..... నచ్చితే ఏం చేసేవారన్న విషయం గురించి వాదిస్తావేం సిల్లీగా" అంతలో పార్కులో పల్లీలు అమ్మే కుర్రాడు వాళ్ళిద్దరి మధ్యకి వచ్చాడు.

“సార్…పల్లీలు కావాలా సార్?” వాడిని వాళ్ళిద్దరు పట్టించుకోలేదు.

“అసలు నువ్వు పెళ్ళిచూపులకు ఎందుకెళ్ళావ్?” బుచ్చిబాబుని నిలదీసింది సీత.

“అమ్మా పల్లీలమ్మా!”

“మా నాన్నగారు పిల్లని చూడడానికి మేం వస్తాం అని వాళ్ళకి ముందుగానే మాటిచ్చారంట సిల్లీగా…”

“సార్… గరం గరం పల్లీసార్!”

“అయితే రేపొద్దున వేరేవాళ్ళకి మీ అమ్మాయిని మా అబ్బాయికి చేసుకుంటాం అని మాటిస్తారు!…. చేస్కుంటావా?”

“అమ్మా! పల్లీ తీస్కోమ్మా!…”

“అలా ఎలా చేసుకుంటాను… మీరిచ్చిన మాటతో నాకేం సంబంధం లేదని దెబ్బలాడతాను!”

“సార్… గరం గరం పల్లీ సార్…”

“అలాగే మీరిచ్చిన మాటతో నాకేం సంబంధం లేదు అని పెళ్ళి చూపులకి కూడా వెళ్ళకుండా వుండాల్సింది…”

“అమ్మా…వేడి వేడి పల్లీలమ్మా…తీస్కోమ్మా!”

సీతకు చిర్రెత్తుకొచ్చి పల్లీలమ్మే కుర్రాడు చెంప ఛెళ్ళు మనిపించింది.

“ఏంటో… పల్లీలు కావాలంటే ఇంతకోపం తెచ్చుకున్న మహాతల్లిని ఈమెనే చూస్తున్నా…” అని లోలోపల గోణుక్కొంటూ, చెంప రుద్దుకుంటూ ముందుకెళ్లాడు ఆ కుర్రాడు.

“నువ్వసలు ఆ పెళ్లి చూపులకి వెళ్ళడమే నాకిష్టం లేదు!…. అనలు నీ తిక్క ఇలాక్కాదు కుదిరేది…. నేను మా ఆఫీసులో మారుమూలకో ట్రాన్స్‌ఫర్ పెట్టుకుని ఈ ఊరొదిలి వెళ్లిపోతా అప్పుడు తెలుస్తుంది” బుచ్చిబాబుని రెండు చేతుల్తో పక్కకి తోసి విసురుగా పార్కు గేటు వైపు అడుగులు వేసింది సీత.

“సీతా..నేను చెప్పేది విను సీతా…” బుచ్చిబాబు వెనక నుండి అరుస్తున్నాడు. క్షణాల్లో సీత పార్కు గేటుని చేరుకుని అక్కడ వున్న ఆటోని ఎక్కి వెళ్ళిపోయింది. బుచ్చిబాబు వెర్రిమొహం వేసుకుని అలానే వుండిపోయాడు.

అప్పుడే చుడువా అమ్మేవాడు బుచ్చిబాబు దగ్గరికి వచ్చాడు.

“సార్…చుడువా తింటారా సార్?”

బుచ్చిబాబు వాడి పీకుచ్చుకుని “ఈ” అని గట్టిగా అరిచాడు.

“చుడువా తింటారా?” అని అడిగినందుకే అంత కోపం ఎందుకో పాపం వాడికి అర్థం కాక పాపం బిక్క చచ్చిపోయాడు.

0 0 0

బుచ్చిబాబుకి ఆఫీసు పని మీద మనసు అస్సలు లగ్నం కావడం లేదు. క్రితం రోజు సీత అలా లేచి వెళ్లి పోవడం అతనికి చాలా బాధగా అనిపించింది. సీతకి అంత కోపం ఎప్పుడూ రాలేదు.

నిజమే మరి... సీత పెళ్లి చూపులంటూ వేరే వాళ్ళముందు కూర్చుంటే నాకు మాత్రం కోపం రాదా? అనుకున్నాడు బుచ్చిబాబు .

సీతతో మాట్లాడితే తప్ప అతనికి - మనసు స్థిమితపడేలా లేదు. రాస్తున్న ఫైలుని ప్రక్కన పెట్టి హెడ్‌క్లర్క్ టేబుల్ మీద ఉన్న ఫోన్ దగ్గరికెళ్లి సీత పనిచేస్తున్న ఆఫీసు నెంబరు తిప్పాడు.

“హలో... సీతని ఓసారి పిలుస్తారా?” అడిగాడు బుచ్చిబాబు.

“మీ పేరు?...” అవతలి కంఠం అడిగింది.

బుచ్చిబాబుకి చిర్రెత్తుకొచ్చింది.

‘నా పేరు ఏమైతే విడికెందుకు?.... సీతను పిలవచ్చుకదా?’ అనుకున్నాడు.

“వల్లకాట్లో రామనాథం!...” పళ్ళు కొరుకుతూ అన్నాడు బుచ్చిబాబు.

“అలాగా?... ఏం పని?” మళ్ళీ ప్రశ్నించింది ఆవతలి కంఠం.

బుచ్చిబాబుకి వళ్ళు మండిపోయింది. వాడు తప్పకుండా సీత బాస్ అయివుంటాడు.

“చాలా కొంపలు మునిగే పనండీ.. పిలుస్తారా?” అన్నాడు కోపాన్ని అణుచుకుంటూ.

“ఓహో అలాగా?... లైన్లో వుండండి!” అంది అవతలి కంఠం.

“రాములూ... సీతకి ఫోన్ వచ్చింది.. రమ్మను” అని చెప్పడం బుచ్చిబాబుకి వినిపించింది.

“అవును ఇందాక మీ పేరు వల్లకాట్లో రామనాథం అని చెప్పారు కాదా... మీ ఇంటి పేరు వల్లకాట్లో, అంటే మీదే కులమో నాకసలు అర్థం కావడంలేదు” బుచ్చిబాబుతో అంది అవతలి కంఠం.

“మాదా?... దిబ్బకులం! దిబ్బలోళ్లు అంటరు మమ్మల్ని” పళ్ళు కొరుకుతూ అన్నాడు బుచ్చిబాబు.

“దిబ్బకులం!... వెరీ ఫన్నీ అలాంటి కులం ఒకటి ఉందని నాకు ఈనాటివరకూ తెలీదే!... ఆ... సీత వచ్చి... మాట్లాడండి!”

రెండు క్షణాల తర్వాత సీత గొంతు “హలో... ఎవరూ?” అంది.

“నేనే... బుచ్చిబాబుని!!” అన్నాడు బుచ్చిబాబు.

సీత అటు నుండి “హలో... హలో...హలో...” అని అరిచి “డిస్కనెక్ట్ అయిపోయినట్టుంది సార్” అని వాళ్ళ బాస్‌తో అనడం వినిపించింది.

“లేదు... డిస్కనెక్ట్ కాలేదు.... నేను లైన్లోనే వున్నాను” అరిచాడు కావాలనే అలా చేసిందని.

నిస్సత్తువుగా రిసీవర్ క్రెడిల్ చేశాడు బుచ్చిబాబు.

అప్పుడే ప్యూన్ వచ్చి “బుచ్చిబాబుగారూ... మిమ్మల్ని అయ్యగారు పిలుస్తున్నారు!”

అని చెప్పాడు.

బుచ్చిబాబు మేనేజర్ ఏకాంబరం క్యాబిన్‌లోకి వెళ్ళాడు.

"రావయ్యా బుచ్చిబాబూ... నీకో బ్యాడ్ న్యూస్!" అన్నాడు ఏకాంబరం.

"ఏంటండీ?" భయంగా అడిగాడు బుచ్చిబాబు.

"నీకు విజయవాడ ట్రాన్స్‌ఫర్ అయ్యిందయ్యా...ఇదిగో ...ఇప్పుడే హెడ్ ఆఫీసు నుండి ఆర్డర్ వచ్చింది. ఏ కిల్లారి కిత్తుగాడు నీకు ఈ ఆర్డర్ వేశాడో గానీ" అంటూ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ తీసి బుచ్చిబాబు ఇచ్చాడు.

ఆర్డరు చదివిన బుచ్చిబాబు మొహం పాలిపోయింది. కొన్ని క్షణాలు పాటు అతని మెదడు మొద్దుబారిపోయింది.

"సార్..నేను ఈ ఆఫీసులో చాలా అవసరమనీ, ఈ ఆఫీసుకి బాగా పనికి వచ్చే నన్ను సిల్లీగా విజయవాడ ట్రాన్స్‌ఫర్ చెయ్యడం అనవసరం అని మీరు రికమెండ్ చేస్తూ హెడ్డాఫీసుకు లెటర్ రాయండి సార్!" దీనంగా మొహం పెట్టి అడిగాడు బుచ్చిబాబు.

ఏకాంబరం తల అడ్డంగా ఊగించాడు.

"లాభంలేదు బుచ్చిబాబూ... హెడ్డాఫిసులో అందరూ డస్కుఢమాల్‌గాళ్ళుంటారు. ఇలంటి రికమెండేషన్లు వాళ్ళు ఖాతరు చెయ్యరు...నీ విషయంలో నేనేం చెయ్యలేను..."

"సార్...!" బాధగా అన్నాడు బుచ్చిబాబు ఇంకేం అనలేక.

రెండు క్షణాలు ఆలోచించి ఏకాంబరం ఇలా అన్నాడు "ఇంతగా ప్రాధేయ పడుతున్నావ్ కాబట్టి ఓ సహాయం చేస్తా. నిన్ను వెంటనే రిలీవ్ చెయ్యకుండా అట్టే పెట్టుకుంటా... హెడ్డాఫీసు వాళ్ళు అడిగినా పెండింగ్ పని చాలా వుంది... బుచ్చిబాబు కొన్ని రోజుల పాటు నాకవసరం అని చెప్తా... ఈ లోగా నువ్వు నీ ట్రాన్స్‌ఫర్ ఏ యమ్మెల్యేనో, మినిస్టర్‌నో పట్టుకుని కాన్సిల్ చేయించుకునే ప్రయత్నం చేసుకో"

"అలాగే సార్...థాంక్స్ సార్" అని అతని క్యాబిన్‌లోంచి నీరసంగా బయటికొచ్చి తన సీట్‌లో కూలబడ్డాడు బుచ్చిబాబు.

అతని బుర్రలో ఎన్నో ఆలోచనలు! ట్రాన్స్‌ఫర్ మీద విజయవాడ వెళ్ళిపోతే సీత ఇక్కడ, తను అక్కడా...సీతకి దూరంగా ఎలా బ్రతకడం?....

ట్రాన్స్‌ఫర్‌ని ఎలాగైనా ఆపించాలి!

కానీ ఎలా?.... ఎలా??.... ఎలా???

3

"కాబట్టీ...." చెప్తూ చెప్తూ అగి సీత మొహంలోకి చూశాడు బుచ్చిబాబు. ఆమె శ్రద్ధగానే వింటుందని గ్రహించి మళ్ళీ కంటిన్యూ చేసాడు బుచ్చిబాబు "నేను ఎలాగైనా సరే నా

ట్రాన్స్‌ఫర్‌ని ఆపుకోవాలి. లేకపోతే నువ్వు ఇక్కడ... నేను విజయవాడలో! అమ్మో! నేను వుండలేను..."

"పెళ్ళీ పెటాకులు లేకుండా మాత్రం ఎన్నాళ్లయినా వుండగలుగుతావ్" బుంగమూతి పెట్టి అంది సీత.

అటూ ఇటూ పరికించి చూసాడు. పార్కులో తమకి సమీపంలో ఎవరూలేరు. సీతని ముద్దుపెట్టుకోవాలని బుచ్చిబాబు ముందుకు వంగాడు. మరుక్షణంలో ముద్దు పెట్టుకూంటాడనగా పొదల వెనుక నుండి మెరుపులా చేతిలో బుట్టతో ఓ కుర్రాడొచ్చాడు.

"సార్...బఠానీలు కావాలా సార్!" అడిగాడు ఆ కుర్రాడు.

ఊహించని ఈ సంఘటనకి ఉలిక్కిపడి వెనక్కి పడ్డాడు బుచ్చిబాబు.

"బఠానీలు వద్దు! ఒకవేళ నీ దగ్గర పల్లీలు వుంటే అవి కూడా వద్దు. గరంగరంగా వున్నా. చల్లగా వున్నా ఎలా వున్నా వద్దు!" పళ్లు కొరుకుతూ అన్నాడు బుచ్చిబాబు .

సీత కిసుక్కున నవ్వింది. బఠానీలు అమ్మే కుర్రాడు బుచ్చిబాబు వంక ఓసారి నిర్లక్ష్యంగా చూసి అక్కడికి నాలుగైదు గజాల దూరంలో వున్న సిమెంట్ బెంచిమీద కూర్చుని వాళ్లనే చూడసాగాడు.

"వీడు ఇక్కడే ఎందుకు తగలడ్డాడు సిల్లీగా? ఎక్కడైనా వేరే చోటికెళ్ళి కూర్చోవచ్చుగా?" విసుక్కుంటూ అన్నాడు బుచ్చిబాబు .

"అది వాడిష్టం. ఇది పబ్లిక్ పార్క్!! ఎవరిష్టమొచ్చినచోట వాళ్ళు కూర్చుంటారు. వాడిని ఇక్కడ కూర్చోవద్దని అనడానికే మనకేం హక్కు లేదు. అంతేకాదు. మనం ఈ పార్కులోంచి బయటకెళ్ళేదాకా వాడిక్కడ నుండి లేవడు. మనకి కాపలా అన్నమాట. బఠానీలు కొనలేదన్న కసి తీర్చుకుంటున్నాడు.!!" వచ్చే నవ్వును ఆపుకుంటూ అంది సీత.

"వీడి దగ్గర బఠానీలు కొంటే అప్పుడు శనగలవాడు వచ్చి కూర్చుంటాడు. ఎలా వీళ్ళతో చచ్చేది?" జుట్టు పీక్కున్నాడు బుచ్చిబాబు.

"అందుకే త్వరగా పెళ్ళి చేసోక్కో. అప్పుడు నీకే విధమైన అడ్డూ వుండదు."

"దాని గురించి మాట్లాడటానికే ఇప్పుడు నిన్నిక్కడికి రమ్మన్నాను".

బుచ్చిబాబు ఈమాట అనగానే ఆమెకి ఎంతో ఉత్సాహం వచ్చింది. చటుక్కున వంగి కుతూహలముగా ప్రశ్నించింది "అదేంటో కాస్త త్వరగా చెప్తావా?"

బుచ్చిబాబు గొంతు సవరించుకున్నాడు.

"మొన్న ఆ పిచ్చికవారి పిడుగుపిల్ల మా నాన్నగారికి నచ్చలేదు కాబట్టి సరిపోయింది. లేకపోతే సిల్లీగా పెద్ద గొడవైపోయి వుండేది. ఇంక ఆయన ఊర్కోరని నాకు అర్థం అయిపోయింది వర్సపెట్టి వేరే అమ్మాయిల్ని చూస్తూనే వుంటారు. నా దుంప తెంచుతూనే వుంటారు. కాబట్టి ఈ వేళే మా అమ్మా నాన్నలకు నీ గురించి చెప్తాను. వాళ్లని ఎలాగైనా ఒప్పిస్తాను. దానికి నీ సహకారం కూడా కావాలి".

"ఏంటది?"

"నువ్వు ఆఫీసుకు శలవుపెట్టి రెండ్రోజులు మా ఇంట్లో వుండాలి".

"మీ ఇంట్లోనే... బాబోయ్ ఎందుకు?" గుండెలమీద చెయ్యేసుకుంటూ అడిగింది సీత.

"మామూలుగా చెప్తే మా నాన్నగారు ఒప్పుకోకపోవచ్చు, కాబట్టి నువ్వు ఓ రెండు రోజులుండి నీ ప్రవర్తన ద్వారా మా అమ్మానాన్న మనసు దోచుకోవాలి" అన్నాడు బుచ్చిబాబు.